318) గౌళ

ప॥ నమ్మవలెగాని యెన్నడు సందేహము లేక। యమ్ముల దేవుడు వరమిచ్చు టేమరుదు॥

చ॥ మగనిపై బత్తిసేసి మంచిలోకా లెక్కేరట। తగు దండకోల వట్టి తత్వగతి గనేరట।
పగటున నొకవేరు వట్టి పాము బట్టేరట। తగిలి హరిదాసులు ధన్యులౌ టేమరుదు॥

చ॥ యేలికకు ధనమిచ్చి హితభోగా లందేరట। కేల గత్తిపూని పగ గెల్చేరట।
గాలి లోలో బూరించి ఘనసిద్ధు లయ్యేరట। యేలీల హరిదాసులు యీడేరు టేమరుదు॥

చ॥ దిక్కుల యజ్ఞాలు చేసి దివిజు లయ్యేరట। మొక్కి విప్రుల నర్చించి ముంచి సిరు లందేరట।
పక్కన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు। జక్కన గొల్చినదాసులు జ్ఞానులౌ టేమరుదు॥